ప్రజల భాగస్వామ్యం ఏది?

- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో తూతూమంత్రంగా గ్రామసభలు
- సమస్యల పరిష్కారం గాలికే
- అవగాహన కల్పించని అధికారులు


పల్లెపాడులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు (ఫైల్)

మానవపాడు: ప్రజా సమస్యలు గ్రామసభలో చర్చించి వాటి పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. కానీ గ్రామ పంచాయతీల పాలక వర్గం గడువు ముగిసి ప్రత్యేకాధికారుల పాలన వచ్చిన తర్వాత పేరుకే గ్రామసభ అన్నట్లు నిర్వహించి తూతూమంత్రంగా చేతులు దులుపుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల నమోదు వివరాలను గ్రామసభల ద్వారా నిర్వహిస్తుంటారు. ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను ఈ సభల ద్వారానే తెలుసుకుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న గ్రామసభలు మండలంలో నామమాత్రంగానే సాగుతున్నాయని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

గ్రామసభల నిర్వహణ తీరు

గ్రామసభ నిర్వహించే తేదీని ముందుగానే గ్రామస్తులకు తెలియజేయాలి. నిబంధనల ప్రకారం విధిగా 18 శాఖల అధికారులు, జనాభాలో సుమారు 20 శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరయ్యేలా అధికారులు ప్రత్యేకశ్రద్ధ చూపాలి. రెండు నెలలకోసారి, సర్పంచ్‌లు, ప్రత్యేకఅధికారులు పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించాలి. సభకు హాజరయ్యే అధికారులు గ్రామంలోని సమస్యలను నమోదు చేసుకోని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలి. పంచాయతీల ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపిస్తారు.

అంటీముట్టనట్లుగానే..

మండలంలోని చాలా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలకు కనీసం పది మంది కుడా రావడం లేదు. ప్రజాప్రతినిధులు, మాజీలు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీలు మాత్రమే వస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి విషయంలో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య అంతగా సమాచారం ఉండటం లేదు. గత సభలో లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం లభిస్తే గ్రామసభలపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది.

సమస్యలు గాలికే..



గ్రామసభలోని ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపట్లేదు. దీంతో గ్రామసభలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుంది. దీంతో తూతూమంత్రంగానే సభలు నిర్వహించే పరిస్థితి వచ్చింది. అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

– నరసింహులు, మాజీ సర్పంచ్, మానవపాడు

పేరుకే గ్రామసభలు..



గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలకు వెళ్లి ఏదో సంతకాలు పెడితే చాలు అన్న చందంగా ప్రస్తుత ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. గ్రామస్థాయిలో సమస్యలు అలాగే పేరుకుపోతున్నాయి. గ్రామసభలో సమస్యలు విన్నవించుకున్నా లాభం లేదు అనే స్థాయికి ప్రజలు వచ్చారు. అందుకే గ్రామ సభలకు ప్రజలు వెళ్లడం లేదు.

– నరసింహులు, మాజీ సర్పంచ్, చందూరు

ప్రజల భాగస్వామ్యం పెరగాలి..

గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింతగా పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులు దండోరా వేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రజలు స్వచ్ఛందంగా సభకు రావాలి. ఈ గ్రామసభల ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకోని పరిష్కరించేందుకు వీలుంటుంది.

– భాస్కర్, ఎంపీడీఓ, మానవపాడు

క్లుప్తంగా

శివాలయంలో పూజలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివుడిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ అభిషేకం చేశారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి శివుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.

సత్యశోధన యాత్రికుడికి సన్మానం



ధరూరు: బాపు బాటలో సత్య శోధన యాత్రికుడిని మండల కాంగ్రెస్ నాయకులు డీఆర్ శ్రీధర్ ఘనంగా సన్మానించారు. యాత్రలో భాగంగా బాపు బాటలో సత్య శోధన యాత్రికుడు సోమవారం మండల కేంద్రానికి చేరుకుని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ డీఈఓ, మాజీ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్‌ను ధరూరులో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

రైతుల్లో ఆందోళన

రాజోళి: మండలంలో రైతుల్లో ఆందోళన నెలకొంది. వాతావరణం మేఘావృతం కావడం, తుఫాన్ ఉందని వార్తలు రావడంతో పత్తి రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రస్తుతం పత్తి తీస్తున్న రైతులు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. వర్షాలు కురిస్తే పత్తి తడిసిపోయి ధర తగ్గుతుందని, పెట్టిన పెట్టుబడులైనా వస్తాయా? లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తీస్తున్న పత్తి పొలాల్లోనే ఉండటంతో రైతులు దిగులు చెందుతున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



అయిజ: బీజేపీని బలోపేతం చేయడానికి చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. సోమవారం పట్టణంలోని వివిధ కాలనీల్లో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కంపాటి భగత్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యర్తలు, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

గ్యార్వీ ఉత్సవాలు ప్రారంభం



అమరచింత: పట్టణంలోని మహబూబ్ ఉస్సేనీ దర్గా షరీఫ్ ఉర్సోత్సవాలు సోమవారం సోమవారం గంధోత్సవంతో నిర్వాహకులు జిలాని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉర్సోత్సవాల సందర్భంగా మంగళవారం దర్గా వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నామని, భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఎస్ఆర్ ప్రేమయ్యకు ఘన నివాళి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 14వ వార్డులో గల అంబేడ్కర్ కాలనీకి చెందిన ధ్యానరత్న అవార్డు గ్రహీత ఎస్ఆర్ ప్రేమయ్య ఈనెల 4న గుండెపోటుతో మృతి చెందారు. ప్రేమయ్య కుటుంబ సభ్యులు సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, బీసీ పొలికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ఎన్‌జే బోయేజ్, పి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గొల్లబాబు, శేఖర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సంద వెంకటేష్, పి.మోహన్‌రెడ్డి, మిషేక్, ప్రసాద్, ముజీబ్ తదితరులు ఉన్నారు.

'ఆవులను గోశాలలకు తరలిస్తాం'


పశువుల బందెలో బంధించిన ఆవులు

అయిజ: పశువుల బందెలో ఉన్న ఆవులను వాటి యజమానులు విడిపించక పోకుంటే వాటిని గోశాలకు తరలిస్తామని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా మేకల నాగిరెడ్డి సోమవారం మాట్లాడారు. మండలంలోని వివిధ శివారుల్లో రైతుల పంట పొలాల్లో ఆవులు సంచరించి పంటలకు నష్టం కలిగించాయని తెలిపారు. పంటలను కాపాడేందుకు ఆవులను మండల కేంద్రంలోని రైతు సంఘం పరిధిలో ఉన్న పశువుల బందెలో బంధించినట్లు తెలిపారు. ఆవుల యజయానులు వెంటనే రుసుం చెల్లించి వాటిని విడిపించుకెళ్లాలని సూచించారు.

ప్రహరీ నిర్మించరూ..!


తక్కశిలలో మూత్రశాలలు ఉన్న చోట పడిపోయిన ప్రహరీ

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలికల మూత్రశాలలు ఉన్నా అవి రోడ్డు పక్కల ప్రహరీ పడిపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు నిధులు వచ్చినా పడిపోయిన ప్రహరీని నిర్మించడంలో అధికారులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనకు వ్యక్తం చేస్తున్నారు. బాలికలు మూత్రశాలలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: కొత్తకోట మండలం కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 50పడకల ఆస్పత్రి భవన నిర్మాణం కోసం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సోమవారం స్థానిక తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబర్ 550లో గల ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు. తహీల్దార్ కార్యాలయం పక్కన గల ఈ ప్రభుత్వ భూమిలో ఆస్పత్రి ఏర్పాటు చేస్తే మదనాపురం, కొత్తకోట మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. స్థలాన్ని పరిశీలించినట్లు నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో పి.ప్రశాంత్, గొల్లబాబు, ఎన్‌జే బోయేజ్, కృష్ణారెడ్డి, సుభాస్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సవాయిగుడెంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.ఉత్తరయ్య మాట్లాడుతూ నిషేధ భూములు, లావాణి పట్టా భూముల చట్టాలు, మోటార్ వెహికిల్స్ చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదవుతాయని, వారు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు కారన్నారు. డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ వేక్ ఆఫ్ గురించి తెలియజేస్తూ అత్యాశకు పోయి తమ డబ్బులు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించి ఓటీపీలు, ఆధార్, అకౌంట్ నెంబర్ చెప్పరాదని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బుడగజంగాలు ఆర్థిక పురోగతి సాధించాలి


కొన్నూరులో సర్వే చేస్తున్న నాయకులు

మదనాపురం: బేడ బుడగ జంగాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ స్వశక్తిపై ముందుకు పోవాలని బేడ బుడగ జంగం యూత్ మండల అధ్యక్షుడు మోతే హుస్సేన్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కొన్నూరులో బుడగ జంగాల కుటుంబాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేడ బుడగ జంగాల స్థితిగతులపై సర్వే నిర్వహించి రాష్ట్ర నాయకత్వానికి అందజేస్తామని, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నివేదిక సమర్పిస్తారని పేర్కొన్నారు. తమకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయుత నివ్వాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసమే వాడుకోకుండా ఆర్థిక పురోగతికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి ఆదుకోవాలన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత



ఎర్రవల్లి: అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. పెబ్బేరు వైపు నుంచి 44వ జాతీయ రహదారిపై ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురానికి ఆదివారం అర్ధరాత్రి బొలెరో వాహనంలో అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తనిఖీ చేసి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం బొలెరోను పీఎస్‌కు తరలించి డ్రైవర్ తంబలి రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

డీఎస్పీకి ఫిర్యాదు

కేటీదొడ్డి: పొలం విషయంలో తనపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని మండలంలోని పాగుంట గ్రామానికి చెందిన మహేష్ సోమవారం గద్వాల డీఎస్పీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశాడు. బాధితుడికి ఈర్లబండ శివారులోని భూమి కలదు. పొలం కబ్జాకు చేసుకుంటూ తనపై అకారణంగా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాళికాదేవి ఆలయంలో అన్నప్రసాద వితరణ



అమరచింత: మండల కేంద్రంలోని శ్రీకృష్ణనగర్‌లో వెలసిన కాళికామాత ఆలయంలో సోమవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దేవీనవరాత్రుల సందర్భంగా అమ్మవారికి వడి నింపిన బియ్యంతో భక్తులకు అన్నప్రసాదంగా అందించామని ఆలయ నిర్వాహకులు కొట్టం నాగేశ్వర్‌రెడ్డి, తాటికొండ రమేష్ తెలిపారు. అదే విధంగా అమ్మవారి చీరలను వేలం పాటలో మహిళలు దక్కించుకున్నారన్నారు.

మైనర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: తీవ్ర ఒత్తిడిని భరించలేని ఓ మైనర్ విద్యార్థిని సోమవారం రాత్రి ఆయుర్వేదం మందు తాగి అస్వస్థతకు గురైన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన ఓ మైనర్ విద్యార్థినీ చదువు విషయంలో కొన్ని రోజుల నుంచి కలత చెందుతుంది. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు సరిగా చదవకపోతే త్వరలో వివాహం చేస్తామని హెచ్చరించారు. దీంతో చదువుల విషయంలో ప్రోత్సాహం చూపాల్సిన కుటుంబ సభ్యులు వివాహం చేస్తామని చెప్పడంతో కలత చెంది రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని ఆయుర్వేదం మందును తాగి అపస్మరక స్థితిలోకి వెళ్లింది. ఇంట్లోకి వచ్చిన కుటుంబ సభ్యులు బాధితురాలిని గమనించి హుటాహుటిన చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, ప్రమాదం లేదని చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌ను సాక్షి సంప్రదించగా బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. విద్యార్థిని ప్రస్తుతం వైద్యుల పరవ్యేక్షణలో ఉందన్నారు.

పనుల ప్రణాళికలు అందజేయండి


సమావేశంలో చర్చిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

శాంతినగర్: 2025–26 ఏడాదికి సంబంధించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టాల్సిన పనుల ప్రణాళికలు కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమావేశం స్థానిక ఐకేపీ భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని నర్సరీల్లో పెంచి మిగిలిపోయిన మొక్కలను గ్రేడింగ్ చేసి సిఫ్టింగ్ చేయాలని, ప్రైమరీ బెడ్ల ఏర్పాటు కోసం ఎర్రమట్టిని సిద్ధం చేయాలని, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామాల్లో పనులు గుర్తించి 2025–26 ఏడాదికి ప్లాన్ చేయాలనే అంశాలపై అధికారులకు సూచనలివ్వడమేగాక పనుల విషయమై చర్చించారు. సమావేశంలో ఏపీఓ కుమార్, ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న యానాల ప్రభాకర్‌రెడ్డి

గద్వాల అర్బన్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో చేనేత వస్త్రధారణను ప్రోత్సహించడం, స్వదేశీ వైద్యం, సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడడం తదితర గాంధీ సిద్ధాంతాల ప్రచారం కోసం డాక్టర్ విజయ్‌కుమార్ అలంపూర్ నుంచి అచ్చంపేట వరకు చేపట్టే సత్యశోధన పాదయాత్ర మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షుడు రాజుసాగర్, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉదయం 10గంటలకు గాంధీచౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు గాంధీ వేషధారణలో విద్యార్థులతో ర్యాలీ చేపడతారన్నారు. ఉపాధ్యాయులు, మహిళలు, యువకులు, పుర ప్రముఖులు అధిక సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హన్మిరెడ్డి, ప్రతాప్, ఈశ్వర్, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎల్వోసీ అందజేత


ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు సోమవారం అందజేశారు. రాజోళి మండలం తుమ్మిళ్లకు చెందిన వర్షిణి వైద్యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా రూ.2లక్షల ఎల్‌ఓసీ రావడంతో లబ్ధిదారులకు అందజేశారు. వారితో పాటు నాయకులు పరుశురాముడు, అనిల్ కుమార్, అజయ్ ఉన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే..

అలంపూర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే విజయుడు సోమవారం పరామర్శించారు. మానవపాడు మండలం చిన్నపోతులపాడుకు చెందిన ప్రశాంతమ్మపై వేడి నూనె పోయడంతో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. వడ్డేపల్లి మండలం తనగలకు చెందిన కురువ బుచ్చన్న రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన మహేష్ ఇస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాముడు తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి ప్రయాణికుల పాట్లు


బస్సు వద్ద ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

అయిజ: ప్రయాణికులు అర్ధరాత్రి ప్రయాణం చేసి గమ్యం చేరుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతిరోజు రాత్రి 11గంటలకు అయిజ నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించారు. దసరా పండుగ ముగించుకున్న ప్రజలు ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణం చేసేందుకు రాత్రి 11గంటల బస్సుకోసం సుమారు 100 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు రాగానే సీట్లకోసం చిన్నపాటి యుద్ధం చేశారు. సీట్లు నిండినా సగం మంది ప్రయాణికులు బస్సు చుట్టూ గుమిగూడారు. ఇంకో బస్సును ఏర్పాటు చేయాలని పట్టు బట్టారు. దీంతో ఆర్టీసీ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీస్ బృందం సంఘటనా స్థలానికి చేరి ప్రయాణికులకు నచ్చచెప్పినా వినలేదు. చేసేదేమీ లేక ఆర్టీసీ అధికారులు రెండో బస్సును ఏర్పాటు చేశారు. ఈ విషయంపై డిపో మేనేజర్ మురళీకృష్ణను వివరణ కోరగా, ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి రెండో బస్సును ఏర్పాటు చేసినా ప్రయాణికులు చాలా మంది గద్వాల సమీపంలోని రైల్వే స్టేషన్‌లో దిగిపోయినట్లు తెలిపారు. కేవలం 20 మంది మాత్రమే హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పల్లయ్య

అయిజ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురవ పల్లయ్య కలెక్టర్ సంతోష్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అయిజ మండలం విద్యలో వెనుకబడి ఉందన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పీఎస్, యూపీఎస్, ఎంపీహెచ్ఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. దాని వల్ల విద్యార్థులు విద్యను నేర్చుకునేందుకు నోచుకోవడం లేదన్నారు. మండలంలోని వెంకటాపురం, గుడుదొడ్డి, సింధనూరు, తొత్తినోనిదొడ్డి గ్రామాల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మేడికొండ, ఉప్పల, అయిజ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందన్నారు. కిష్టాపురం, బైనిపల్లి పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేడని వాపోయారు. ఇటీవల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోవడంతో విద్యార్థులకు బోధించే వారు లేకుండా పోయారన్నారు. మండలంలో మొత్తం 65 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డీఎస్సీలో ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులను అయిజ మండలానికి నియమించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ డీఈఓను ఆదేశించి ఖాళీలను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చినట్లు తెలిపారు.

20న ఐఫ్టూ విలీన సభ

అమరచింత: 14 రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం అవుతుందని, ఈమేరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న విలీన సభను నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు తెలిపారు. విలీన సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 45 కోట్ల కార్మికుల్లో కేవలం 6కోట్ల కార్మికులు మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నారన్నారు. మిగితా అసంఘటిత కార్మికులు కడు దరిద్రంలో జీవిస్తున్నారని వాపోయారు. కనీస వేతనాలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ గ్రాట్యుటీ పెన్షన్లు లేవన్నారు. కార్యక్రమంలో సీపీఐ మాస్‌లైన్ మండల కార్యదర్శి రాజన్న, సామేలు, భక్తరాజు, ప్రేమరత్నం, బాలస్వామి, రాంచందర్, జిలాని, సత్యన్న, నరసింహ పాల్గొన్నారు.